# 'ఉల్చి'

"రంగు మాట్లాడుతుంది...

రేఖ పలకరిస్తుంది. పరవశింపజేస్తుంది

రంగులకీ రేఖలకీ రుచీ పరిమళం ఉంటాయి...

చిత్రకారుడు ఒక వింత మనిషి. మనలో వున్నట్టు వుంటూనే కనిపిస్తూ రంగుల్లో వుంటాడు. రేఖల్లో కదులుతాడు. తన ఊహల వర్ణ సమ్మేళనంలోకి చొచ్చుకుపోతాడు. కేంద్రాభిముఖంగా పయనిస్తూ, క్యాన్వాసు మీదున్న తన చిత్ర రచనలో అంతర్లీనమవుతాడు. అక్కడినుంచీ అతను కేంద్ర ప్రసారకంగా తన భావాల్ని విరజిమ్ముతాడు. బాహ్య ప్రపంచంలోకి తన వైయక్తిక అనుభూతుల్ని చిత్రకారుడు మనకు మాటల్లో చెప్పడు, వాటిని రంగుల్లోకి అనువదిస్తాడు. గీతల చాటుకు తప్పుకుంటూ అంతర్ముఖుడవుతాడు.

రూపాల్ని అరూపాలుగా మారుస్తాడు. సుపరిచిత విషయాల్ని అపరిచిత ఆకారాలుగా మలుస్తాడు. వస్తువుల రూపాలనించీ వాటి రంగుల్ని విడదీస్తాడు. ఉద్వేగాలకు రూపకల్పన చేస్తాడు."

పై అభిప్రాయాన్ని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ శ్రీ పి.వి. రాంకుమార్, చిత్రకారులూ, శిల్పీ, కవీ అయిన ఉల్చి గురించి చెబుతూ సెలవిచ్చారు.

మొన్న ఈనెల పదవ తేదీన ఉల్చి గ్యాలరీ ప్రారంభోత్సవానికి నేను చీరాల వెళ్లాను. ఆ రంగులూ ఆ ఆకృతులూ... ఆయనా ఆయన కవిత్వం... 63 సంవత్సరాల ప్రాయంలో కూడా ఓ పసి నవ్వును ధరించి... అందరితోటీ ఆత్మీయంగా... అందరిపట్లా అనురాగంతో మసలే ఉల్చి గురించి ఓ రెండు మాటలు చెప్పాలన్పించింది. అందుకే ఇది అన్నమాట.

నాకు ముందు 'ఉల్చి' అన్న పేరు వింతగా అనిపించింది. దానివెనుక వున్న విషయం తెల్సుకున్న తర్వాత ఆయన మీద గౌరవం రెట్టింపైంది. పుట్టిన మట్టి మీద మమకారం అందరికీ వుంటుంది. కానీ ఈయన తను పుట్టిన ఊరిపేరుని తన పేరుగా మార్చేసుకునేంత వెఱ్ఱి మమకారం గలవారు. 'ఉల్చి' ఊరుపేరు, ఆయన పుట్టిన ఊరు, అది ఒంగోలు దగ్గరలో చిన్న పల్లె. ఉల్చి అసలు పేరు కృష్ణమూర్తి.

ఉల్చి నాకు కవిగా వారి 'రాతి పొత్తిళ్ళు' కవితా సంకలనంతో పరిచితులు. ఆయన ఆ సంకలనంలో ప్రతి కవితకూ తానే బొమ్మలు వేసారు. ఆ పుస్తకానికి అసలు ఆకర్షణ దాని ముఖచిత్రం. అది ఉల్చి 'కాస్మిక్ స్పెక్ట్రం' పేరున వేసిన పదుకొండు క్యాన్వాసుల్లో ఒకటి. అదే ముఖచిత్రం తీవ్రమైన గురుత్వాకర్షణ శక్తితో నన్ను చీరాల లాక్కుని వెళ్లింది.

అప్పటికింకా ఆయన చిత్రాలు క్రమబద్ధంగా ప్రదర్శింపబళ్లేదు. ఇల్లంతా ఆయన చిత్రించిన వందలాది చిత్రాలు చెల్లాచెదురుగా... ఎక్కడ చూసినా రంగుల హంగులే... చెదురు మదురుగా ఆయన చెక్కిన శిల్పాలు. వాటికి ఆయన వాదని మాధ్యమం లేదు. కాంక్రీటు నించీ లోహం... దారువు... శిల...ఓహ్! చీరాల సముద్రపు హోరుకు ఈయన రంగుల ఘోష కలిసింది. అంతా ఓ వర్ణమయనాదం. వీటన్నిటినీ మించి ఆయన సౌశీల్యత నైర్మల్యం. స్నేహం... అభిమానం... కళను గౌరవించే తీరు ఈ గుణాలను పక్కనుంచితే ఆయన ఓ మహోన్నత మానవవతావాది. అట్లా ఎందుకంటున్నానంటే...

నేనూ ఉల్చి ఆయన తోటలో ఆయన పెంచుతున్న మరుగుజ్జు వృక్షాల్ని చూస్తూ మాట్లాడుకుంటున్నాం. ఒక్కొక్క మహావృక్షం చిన్నచిన్న కుంపట్లలోకి ఒదిగిపోయి మనల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. ఆ మరుగుజ్జు వృక్షాల (Bonsai) మధ్య అక్కడక్కడా ఆయనకు కళాత్మకంగా అనిపించిన (ఆయన ప్రతి వస్తువులోనూ కళను దర్శిస్తారు) వింత వింత ఆకారాలున్న వృక్ష కాండాలనూ, నదుల్లో కొట్టుకొచ్చే కొమ్మలనూ (Drift wood) కళాత్మకంగా అలంకరించి పెట్టారు. వాటిల్లో ఓ పెద్ద వృక్షకాండం రకరకాల ముడులుతో వింత ఆకారంలో ఉంది. ఇంతలో ఓ వ్యక్తి నడుముకు ఓ తుండు కట్టుకుని భుజాన ఓ గొడ్డలి వేసుకుని తోటలోకి వచ్చి ఉల్చికి నమస్కరించాడు. "ఏరా ఎలా వున్నావ్?" అని ఆప్యాయంగా పలకరించారీయన. "ఈరోజు కూలీ ఎక్కడా దొరకలేదండయ్యా. ఆ మొద్దుని పేళ్ళుగా చీల్చి పెట్టనా?" అని కళాత్మకంగా ఆయన దాచుకున్న ఆ చెట్టు బోదెను చూపిస్తూ అడిగాడా వ్యక్తి. నాకు సర్రున మండింది. ఉల్చి మాత్రం ప్రశాంతంగా నవ్వుతూ జేబులోంచి కొంత డబ్బు తీసి వాడికిచ్చి "అక్కర్లేదు లేరా ఇత్తీసుకు నువ్వెళ్లిపో" అన్నారు. మళ్లీ నావేపు తిరిగి "ఆకలికీ కళకీ మధ్య కొన్ని యోజనాలు దూరముంటుందండీ" అన్నారు. ఆ మాటకూ ఆయన మానవతా చేష్టకూ తలవంచి చేతులెత్తి నమస్కరించాను.

'జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరః
నాస్తి తేషాం యశః కాయే జరామరణజం భయం'
ఉల్చి చిరంజీవి- ●